క్లుప్తంగా

ప్రజలతో ప్రేమతో మెలగాలి



బైబిల్ మిషన్ మహాసభలనుద్దేశించి మాట్లాడుతున్న చైర్మన్ సజీవరావు, స్టీరింగు కమిటీ సభ్యులు

ఉంగుటూరు: క్రైస్తవ విశ్వాసులు ప్రజలతో ప్రేమతో మెలగాలని, సేవ చేసే తత్వం అలవర్చుకోవాలని బైబిల్ మిషన్ చైర్మన్ రెవ.డాక్టర్ సజీవరావు పిలుపునిచ్చారు. మంగళవారం రెండో రోజు సభలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఏసు ప్రభువు శాంతి బోధనలను వివరించారు. గీతాలాపనలు, సంగీత విభావరి నిర్వహించారు. బైబిల్ మిషన్ మహాసభల ఉపాధ్యక్షుడు రెవ.డాక్టర్ దైవరావు, కార్యదర్శి రెవ. వైఐడీ ఇమ్మానుయేలు, జాయింటు కార్యదర్శి రెవ. జిఆర్ ఇమ్మానియేలు రాజు విశ్వాసులనుద్దేశించి ప్రసంగించారు. వేలాది మంది విశ్వాసులు, పాస్టర్లకు భోజనాలు ఏర్పాటు చేశారు. నాచుగుంట బస్సు పాయింటు దగ్గర నుంచి స్వాగత బ్యానర్లు ఏర్పాటు చేశారు.

నేడు దివ్యాంగులకు జాబ్ మేళా

దెందులూరు: ఏలూరులోని అల్లూరి సీతా రామరాజు స్టేడియం వెనుక ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో బుధవారం విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక జాబ్ మేళా నిర్వహిస్తామని దెందులూరు ఎంపీడీఓ కే శ్రీదేవి తెలిపారు. పలు సంస్థలు సుమారు 200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు కలిగి 19 నుంచి 30 ఏళ్ల వయస్సున్న వారు అర్హులన్నారు. అర్హత కలిగిన దివ్యాంగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని ఉపాధిని పొందాలన్నారు. మరిన్ని వివరాలకు 9281097229, 9493482414 నంబర్లు సంప్రదించాలని ఎంపీడీవో సూచించారు.

పదో తరగతి స్టడీ మెటీరియల్ వితరణ



పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన యూటీఎఫ్ నాయకులు

ఉంగుటూరు: పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించాలని రాచూరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.విజయ్ కుమార్ అన్నారు. రాచూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ యూటీఎఫ్ సభ్యులు రూపొందించిన పదవ తరగతి మోడల్ టెస్ట్ పేపర్లను ప్రాథమిక పాఠశాల రాచూరు నెంబర్ వన్ ప్రధానోపాధ్యాయులు దారపురెడ్డి శ్రీనివాసరావు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజు, ఉపాధ్యాయులు వెలిచర్ల శ్రీనివాసరావు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌మనోజ్

ఉంగుటూరు: గ్రామస్థాయిలో ప్రణాళికలు తయారుచేసి పంచాయతీలో ఈనెల 31వ తేదీలోపు గ్రామసభలో ఆమోదింపజేసి ప్రభుత్వానికి పంపించాలని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి కోరారు. మంగళవారం సర్పంచులు, ఎంపీటీసీలకు శిక్షణ సమావేశం స్థానిక ఎంపీడీవో సమావేశ హాలులో నిర్వహించారు. ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమగ్రంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఎంపీడీవో మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, ఫ్యాకల్టీ మెంబరు జీడీ శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

షైలాభానుకు ఉత్తమ వీఏఏ అవార్డు



కలెక్టర్ వెట్రిసెల్వీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న వీఏఏ షైలాభాను

భీమడోలు: సూరప్పగూడెం గ్రామ వ్యవసాయ సహాయకులు షైలాభాను ఉత్తమ వీఏఏగా అవార్డును అందుకుంది. ఏలూరులో కలెక్టర్ వెట్రి సెల్వీ చేతుల మీదుగా రిపబ్లిక్ డే సంబరాల్లో ఈ అవార్డును షైలాభాను అందుకున్నారు. రైతులకు అందుతున్న సేవలు, వారిని భాగస్వాములను చేసేలా వీఏఏ చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆమెకు ఉత్తమ వీఏఏగా ఎంపిక చేసి అవార్డును అందించారు. షైలాభానుకు అవార్డు దక్కడంపై మంగళవారం వ్యవసాయాధికారులు, రైతులు, సహచర సిబ్బంది అభినందనలు తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యానికీ పరీక్షే

- మార్చి 17 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
- చదువుపైనే అందరి దృష్టి
- నిద్ర, పౌష్టికాహారానికీ ప్రాధాన్యం ఇవ్వాల్సిందే
- విద్యార్థులకు వైద్యుల సూచనలు



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

పెదవేగి : విద్యా సంవత్సరం చివరిలో నిర్వహించే పరీక్షలు విద్యార్థుల ఏడాది శ్రమ ఫలితానికి ప్రామాణికం. అందుకే పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ విద్యార్థులను భయం, ఆందోళన ఆవహిస్తుంటాయి. ఆతృతతో విద్యార్థులు అధిక సమయం చదవడం, సకాలంలో పౌష్టికాహారం తీసుకోకపోవడం, నిద్రపోకుండా మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. ఈ నేపథ్యంలో పరీక్షలంటే నెలకొన్న భయాన్ని పోగొట్టి విద్యార్థుల ఆందోళనను దూరం చేసి వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు వైద్యులు, విద్యావేత్తలు పలు సూచనలు చేస్తున్నారు.

పరీక్షల నిర్వహణ ఇలా

మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు కొనసాగనున్న నేపథ్యంలో 15 రోజుల పాటు విద్యార్థులు పరీక్షల వాతావరణంలో గడపాల్సి ఉంటుంది. దెందులూరు నియోజకవర్గంలో 3,891 మంది పదోతరగతి, విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



శరీరం, మనస్సు ఒక దానికొకటి అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. మనం తీసుకునే ఆహారం ఈ రెండింటినీ ప్రభావితం చేస్తుంది. పరీక్షల సమయంలో మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలి. పోషక విలువలున్న ఆహారాన్ని విధిగా ఉండేలా చూసుకోవాలి. పరీక్షలు పూర్తయ్యేవరకూ సాత్వికాహారం తీసుకుంటే మంచిది.

– డాక్టర్ ఎల్ శ్రీనివాసరావు, కొప్పాక, ఆయుర్వేద వైద్యశాల

అశ్రద్ధ చేయవద్దు



పరీక్ష కాలంలో ప్రతి క్షణం విలువైనదే. సమస్య ఏదైనా తలెత్తితే విద్యార్థికి సమయాన్ని దూరం చేసేస్తుంది. చదువుతోపాటు తగిన విశ్రాంతి అవసరమని గుర్తించాలి. తలనొప్పి, జ్వరం వచ్చినప్పటికీ ఏకాగ్రత దెబ్బతింటుంది. సమస్య పెద్దది కాకుండానే వైద్యుడ్ని సంప్రదించడం మంచిది. రోజుకు ఆరు గంటల పాటు నిద్రపోవాలి. శరీరానికి, మెదడుకు తగిన విశ్రాంతి అవసరం.

– డాక్టర్ ప్రత్యూష, విజయరాయి, ప్రాథమిక వైద్యశాల

నీరు బాగా తాగాలి



ఆహారంతోపాటు రోజుకు కనీసం మూడు లీటర్ల నీరు ను తాగాలి. ఉదయం రెండు నుంచి మూడు గ్లాసుల నీరు తాగడంతో ప్రారంభం కావాలి. ఆ తర్వాత సాయంత్రం 6 గంటలు వరకూ గంటకొక గ్లాసు చొప్పున నీరు తాగాలి. భోజనం, ఇతర ఆహారం తీసుకోడానికి గంట ముందు నీరు తాగరాదు. తగినంత నీరు తాగనందున తలనొప్పి, వికారం, నీరసం వచ్చి ఏకాగ్రతకు సమస్యలొస్తాయి.

– పి పూర్ణిమ, పెదవేగి, పీహెచ్‌సీ వైద్యాధికారి

దుందుడుకు ప్రవర్తన వద్దు



ప్రతి వ్యక్తి స్వతంత్ర మానసిక స్థితి కలిగి ఉంటారు. ఒక్కొక్కరు చిన్నపాటి సమస్యకు సైతం మితిమీరి స్పందిస్తుంటారు. అలాంటివి పెద్ద సమస్యలకు దారి తీస్తుంటాయి. విలువైన పరీక్షల సమయంలో అటువంటి వాటి జోలికి వెళ్లకుండా జాగ్రత్త పడాలి. సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించడం ద్వారా కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవడంతో పాటు సమయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

– డాక్టర్ మాధవి, పెదవేగి, పీహెచ్‌సీ

మానసిక ఒత్తిడితో ఆరోగ్య సమస్యలు

ఉంగుటూరు: పోటీ ప్రపంచంలో మానసిక ఒత్తిడి ఎక్కువై యువత అనేక ఇబ్బందులు పడుతున్నారని, చివరకు ఆత్మహత్య వరకు వెళుతున్నారని నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు అన్నారు. మంగళవారం హెల్త్ అవేర్నెస్ ఫర్ ఆల్ (హెచ్ఏఎఫ్ఏ-యూఎస్ఏ) గ్రూప్ ఆఫ్ డాక్టర్స్‌తో కలిసి సంయుక్తంగా మెంటల్ వెల్నెస్ అనే అంశంపై ఒక రోజు అంతర్జాతీయ ఆన్‌లైన్ వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ర్యాంకులు, మార్కుల కోసం పోటీపడడమే కాకుండా వ్యసనాలకు బానిసలుగా మారి మానసిక ఒత్తిడి గురవుతున్నారని, మానసిక రోగులుగా మారుతున్న వారిలో ఎక్కువ శాతం యువత ఉంటున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మానసిక రోగాల బారి నుంచి బయటపడటానికి ఇటువంటి వెబినార్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ముఖ్య వక్త అమెరికా దేశంలోని కరోలినా యూనివర్సిటీ, డ్యూక్ యూనివర్సిటీలో కార్డియాలజీ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ శ్రీవాణి రెడ్డి మాట్లాడుతూ మానసిక ఒత్తిడి గుండె ఆరోగ్యంపై ప్రభావం చేపిస్తుందన్నారు. సిందూర్ అంబటి మాట్లాడుతూ మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అంశాలను విద్యార్థులకు వివరించారు. అమెరికాలో పెడియాట్రిక్స్ విభాగంలో సేవలందిస్తున్న డాక్టర్ ఆశ్రిత జొన్నలగడ్డ, ప్రముఖ మానసిక వైద్యురాలు మానస పలు అంశాలు వివరించారు. మెంటల్ వెల్నెస్ ఆన్‌లైన్ వెబినార్ కన్వీనర్ డాక్టర్ కొండా రవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 50 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి పరీక్షల ద్వారా పెట్టుబడి వ్యయం ఆదా



సూరప్పగూడెంలో రైతులకు మట్టి పరీక్షా ఫలితాల పత్రాలను అందిస్తున్న ఏవో ఎస్‌పీవీ ఉషారాణి

భీమడోలు: మట్టి పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులు, పురుగు మందులు వాడితే పెట్టుబడి వ్యయం తగ్గి ఆర్థికంగా బలోపేతమవుతారని భీమడోలు మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీవీ ఉషా రాణి అన్నారు. సూరప్పగూడెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవోతో కలిసి రైతులు వరి పొలాలను సందర్శించారు. దాళ్వా సీజన్‌లో పంట సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు, నివారణ చర్యలు, వ్యవసాయశాఖ చేపట్టిన కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు మట్టి నమూనా పరీక్షా ఫలితాల పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ గ్రామ సహాయకురాలు షైలాభాను, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికతో ఆర్థిక స్వావలంబన



భీమడోలులో మాట్లాడుతున్న ఎంపీపీ కనుమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ

భీమడోలు: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల ద్వారా గ్రామాలు ఆర్థిక స్వావలంబన సాధిస్తాయని భీమడోలు ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) సమగ్ర కార్యాచరణ ప్రణాళికలపై ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులకు మంగళవారం ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. కోర్సు డైరెక్టర్, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సుపరిపాలన దిశగా పని చేయాలని, అదే తరుణంలో గ్రామాలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు తగు ప్రణాళికలను తయారు చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి పలు సూచనలు చేశారు. తొలుత సూరప్పగూడెం కార్యదర్శి ఎం.ముత్తయ్య సభ్యులకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్ ఎం.వెంకట్రావు, సర్పంచులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రాక్టికల్ పరీక్షలు



కైకరం జెడ్పీ హెచ్ఎస్ ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఆంధ్రా బెటాలియన్ ఏలూరు వింగ్–19 పరిధిలోని కైకరం జెడ్పీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు మంగళవారం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు కై కరం జెడ్పీహైస్కూల్ నుంచి 64 మంది, గుండుగొలను నుంచి 38 మంది, నల్లజర్ల ఏకేఆర్‌జే నుంచి 64 మంది మొత్తం 166 మంది హాజరయ్యారు. ఈ క్యాడెట్లకు రెండేళ్ల పాటు మిలటరీ డ్రిల్, ఆయుధ శిక్షణ, మ్యాప్ రీడింగ్ శిక్షణ అందించారు. ఎన్‌సీసీ–ఎ సర్టిఫికెట్ పొందేందుకు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఈ ప్రాక్టికల్ పరీక్షను లెఫ్టినెంట్ కల్నల్ రిషిబ్ సిన్హా, ఇతర ఎన్‌సీసీ అధికారులు పర్యవేక్షించారు. ఎన్‌సీసీ ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని కైకరం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు జి.గవరయ్య, కేజీ భీమేశ్వరరావు, మహబూబ్ వల్లి పాల్గొన్నారు.

చిరంజీవికి అభినందన



వైఎస్సార్‌సీపీ బీసీ జిల్లా అధ్యక్షుడు చిరంజీవిని సత్కరిస్తున్న జయరాజు

పెదవేగి : వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన నెరుసు చిరంజీవిని దెందులూరు నియోజకవర్గ అంకన్నగూడెంకి చెందిన బీసీ నేత సగ్గుర్తి జయరాజు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దిరాజు, తాళం పరుశురామయ్య, తాళం రవి కిషోర్, టి రాంబాబు, మధు మణికంఠ, కూసుంపూడి శివకుమార్, పల్లపోతు వెంకటరామయ్య, చెడుగుండి పెద్దిరాజు, అల్లూరి మణికంఠ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైల్వే ట్రాక్ మరమ్మతులు



భీమడోలులో రైల్వే ట్రాక్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

భీమడోలు: భీమడోలు రైల్వే ట్రాక్ అత్యవసర మరమ్మతు పనులు మరో మూడురోజులు పొడిగిస్తూ రైల్వే శాఖ ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం నిర్ణయంతీసుకున్నారు. దీనితో ఇంకా మూడు రోజులు రైల్వే గేటు మూతపడనుంది. వాస్తవానికి ఈనెల 22వ తేదీ నుంచి 30వ తేదీ నాటికి పనులు పూర్తి కావాల్సింది. పనులు పూర్తి చేసేందుకు సాంకేతిక సమస్యల రీత్యా వచ్చే నెల మూడో తేదీ వరకు రైల్వే గేటును మూసి వేయాలని సంబంధిత అధికారులు నిర్ణయించారు. దీనితో ఈ గేటు మీదుగా ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తులు, వాహనదారులు, రైతులు, ప్రజలు 15 కిలోమీటర్ల దూరం ప్రయాణించి వ్యయ ప్రయాసలు భరించాల్సి ఉంది.

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

దెందులూరు: సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడతాయని పెదపాడు అడిషనల్ సీడీపీఓ సునీల్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం పోతునూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని పోషణ వాటికను పరిశీలించారు. పోతునూరు ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ కే, శ్రీదేవి, సిబ్బందిని ఆయన అభినందించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పోషణ వాటికలో సాగుచేసిన ఆకుకూరలు కూరగాయలను అందజేశారు.

రూ.12.40 కోట్లతో అభివృద్ధి పనులు

పెదపాడు: మండలంలో రూ.12.40 కోట్లతో మండలంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. మంగళవారం పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడారు. మండలంలో ఎన్నికల్లో పలు సమస్యలను తన దృష్టికి తీసుకురావడంతో రూ.12.40కోట్ల విలువైన పనులు చేపట్టినట్లు చెప్పారు. సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చాలి



పాదయాత్ర చేస్తున్న చిక్కాల దుర్గాప్రసాద్

పెదవేగి : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఏపీ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి చిక్కాల దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. పెదవేగి మండలం నుంచి రాటాలగుంట విజయరాయి మీదగా ధర్మాజీగూడెం వరకు దుర్గాప్రసాద్ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ ప్రకారం నిరుద్యోగులకు వెంటనే 20 లక్షలు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు చొప్పున ఆరు నెలలకి 18,000 వెంటనే అందించాలని కోరారు. వలంటీర్ వ్యవస్థను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. నిరుద్యోగుల కోసం నేను ఏలూరు నుంచి కాకినాడ వరకు పాదయాత్ర చేసి కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ఆయన అన్నారు.

పశువులకు నట్టల నివారణ మందు

గణపవరం: పాడి పశువులకు ప్రతి ఆరునెలలకు ఒకసారి నట్టల నివారణ మందు వేయాలని ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ డీఎం నాయక్ అన్నారు. మంగళవారం గణపవరం మండలం వాకపల్లిలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ ఆదిమూలం శ్రీనివాస్ ప్రారంభించారు. ఈసందర్భంగా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నట్టల నివారణ మందు వేశారు. ఈ కార్యక్రమంలో జంతు సంక్షేమ సంఘం సభ్యుడు గరక కొండరాజు, పశువైద్య అధికారి నాగజ్యోతి, జిసురేష్ కుమార్ పాల్గొన్నారు.

కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలి

నిడమర్రు: కొల్లేరు అభయారణ్య పరిధిని 5 నుంచి 3 కాంటూరుకు కుదించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి నారపల్లి రమణారావు అన్నారు. మంగళవారం నిడమర్రు ప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఎం పార్టీ మండల సమావేశం గవర సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ కొల్లేరు పరిధిని 5 నుంచి 3వ కాంటూరుకు కుదిస్తామని, ప్రజల జీవన విధానాన్ని కాపాడతామని కేంద్ర రాష్ట్ర పాలక పార్టీలు చట్ట సభల్లో తీర్మానాలు చేస్తున్నారేగానీ అమల్లో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కొల్లేరు ప్రజల కష్టాలు తీరాలనే చిత్తశుద్ధి ఉంటే చట్టపరమైన ఇబ్బందులు లేకుండా న్యాయస్థానాల్లో పోరాడాలన్నారు. ఇప్పటికే రాజకీయ నాయకుల అండతో రైతుల ముసుగులో వలసదారులు కొల్లేరులో చేపట్టిన అక్రమ తవ్వకాలను అధికారులు నియంత్రించాలన్నారు. కొల్లేరులో భూములున్న రైతుల హక్కులను కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన, లావేటి సోంబాబు, కానూరు రాజు, కంచం వరప్రసాద్ తదితరులున్నారు.

తహసీల్దార్‌ను సత్కరించిన యూటీఎఫ్ నేతలు



పెదవేగి తహసీల్దార్ ఎస్‌డీ భ్రమరాంబను సత్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

పెదవేగి : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏలూరులో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు అందుకున్న పెదవేగి మండల తహసీల్దార్ ఎస్‌డీ భ్రమరాంబను పెదవేగి మండల యుటీఎఫ్ శాఖ తరుపున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యుటీఎఫ్ మండల శాఖ తరుపున మెమొంటో, యూటీఎఫ్ క్యాలెండర్ యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ముద్రించిన బ్యాగ్ అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తేరా ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి పాలిరెడ్డి రమణ, కోశాధికారి మేక లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాలపై బిల్లు పెట్టాం

దెందులూరు: మండలంలో ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాలకు సంబంధించి బిల్లులను ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి పంపించామని దెందులూరు ఎంపీడీవో కే శ్రీదేవి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనం బిల్లులు మంజూరైనవెంటనే వారి బ్యాంకు ఖాతా లకు జమ చేస్తామని, ఎంపీటీసీ సభ్యులందరూ ఈవిషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

ప్రణాళిక ద్వారా వేగంగా గ్రామాల అభివృద్ధి

పెదపాడు: ప్రణాళిక రూపొందించుకుని కృషి చేస్తే గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లకు ఎంపీటీసీలకు ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈకార్యక్రమంలో పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి పాల్గొన్నారు.

అనుమతుల్లేని సర్వీసింగ్ సెంటర్‌ను తొలగించాలి

భీమడోలు: పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురం చెరువుకు మంచినీటిని తరలించే పంట బోదెపై ఎటువంటి అనుమతులు లేకుండా వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి వాహనాల శుభ్రం చేయడం వల్ల నీరు కలుషితమవుతోందని, దీని వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని పలువురు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సోమవారం ఫిర్యాదు చేసారు. ఆ సర్వీసింగ్ కేంద్రాన్ని వెంటనే తొలగించాలని ఏలూరులోని కలెక్టర్ కార్యాలయంలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతు పెద్దిరెడ్డి భోగయ్య ఫిర్యాదు చేసారు. సర్వీసింగ్ సెంటర్‌లో వాహనాలను శుభ్రం చేయడం వల్ల అందులోని గ్రీజు, దుమ్ము అంతా బోదెలోంచి మంచినీటి చెరువులోకి చేరుతోందని తెలిపారు. దీంతో చెరువులోని నీరంతా రంగు మారి దుర్వాసన కొడుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా పంట బోదెపై తూర ఏర్పాటు చేసారని, నాలుగు ఫిల్లర్లతో పెద్ద దిమ్మను నిర్మించారని, దీని వల్ల పంట పొలాలకు నీటి ప్రవాహం తగ్గుతోందని వారు పేర్కొన్నారు. అదే మాదిరిగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని నాయకులు మంగళవారం కోరారు.

ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కు సత్కారం

ఉంగుటూరు: నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాసును ఏలూరులోని శరవణ జూనియర్ కాలేజిలో మంగళవారం సత్కరించారు. ఇటీవల శ్రీనివాస్ డాక్టరేటు సాధించిన సందర్భంగా వారు సత్కరించారు. శరవణం కాలేజి కరస్పాండెంటు గొట్టపు సుబ్రహమణ్యేశ్వర రావుతోపాటు పలువురు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీడీ ప్రభాకరరావు శరవణ జూనియర్ కాలేజి డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం. పెద్రాజు, ఎల్ .శ్యాంకుమార టి.శ్రీనివాసు, శ్రీనివాస్ ,శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డుపై హర్షం

భీమడోలు: పద్మశ్రీ అవార్డు మందకృష్ణ మాదిగకు దక్కడం జాతి గర్వించదగ్గ విషయమని పలువురు ఎంఆర్‌పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. భీమడోలులో సీనియర్ నాయకులు కొత్తపల్లి చంద్రమౌళి అధ్యక్షతన మంగళవారం ఉంగుటూరు నియోజకవర్గ ముఖ్య నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసారు. కొత్తపల్లి చంద్రమౌళి, ఎం.ఏలియా, కాటూరి జోగేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, ఉండి నాగరాజు పాల్గొన్నారు. ఎంఆర్‌పీఎస్ పిలుపు మేరకు ఫిబ్రవరి 7న లక్షల డప్పులు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్.కిషోర్, ఎం.ఆనంద్, సతీష్, మోహనరావు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని అధిగమించాలి



గణపవరంలో మానసిక సమస్యలపై అవగాహన ప్రదర్శన చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: మానసిక ఒత్తిడికి, దురలవాట్లకు దూరంగా ఉంటేనే మనిషి ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునని మానసిక ఆరోగ్య నిపుణులు డా.శంకరరెడ్డి అన్నారు. మంగళవారం గణపవరం పీహెచ్‌సీలో మానసిక ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడి, దురలవాట్లకు లోనయ్యేవారు ఎవరైనా ప్రతీ సోమవారం భీమవరంలోని ఏరియా ఆస్పత్రికి వస్తే ఉచితంగా ఉచితంగా మందులు, కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు. అనంతరం వైద్యసిబ్బందితో కలిసి మానసిక సమస్యలపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి పులపర్తి సంతోష్, సోషల్ వర్కర్ సుమన్‌బాబు, సిహెచ్‌వో జాలాది విల్సన్, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పింఛన్ అర్హత పరిశీలన

గణపవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో మూడు రోజులపాటు మెడికల్ డిజేబిలిటీ పెన్షన్స్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో వైద్యశాఖ అధికారులతో కలిసి మంగళవారం ఆమె వల్లూరు, వాకపల్లి, పిప్పర, కోమర్రు, మోయ్యేరు, ముప్పర్తిపాడులో పింఛనుదారుల ఇళ్లకువెళ్లి వారి వాస్తవ పరిస్థితిని తనిఖీ చేశారు. వైద్యాధికారులు పులపర్తి సంతోష్, ఒంగోలు ఆర్థోఆస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ రవికుమార్, నర్సాపురం ఏరియా ఆస్పత్రి జనరల్ మెడిసిన్ డా. సుహాస్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విల్సన్, ఈవోపీఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.

నూతి రవీంద్ర గౌడ్‌కు పదవి

దెందులూరు: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ఏపీ స్టేట్ జనరల్ సెక్రటరీగా ఏలూరు జిల్లా చల్లచింతలపూడికి చెందిన నూతి రవీంద్రగౌడ్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం కమిషన్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ హెచ్ఎండీ ముజాహిద్ లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు.

పాఠశాలలో రికార్డుల పరిశీలన

నిడమర్రు: విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బంది లేకుండా ఆమోదయోగ్యమైన పద్ధతిలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తి చేసేలా క్లస్టర్ కనీనర్లు కృషి చెయ్యాలని ప్రత్యేక అధికారి అన్నారు. మంగళవారం పెదనిండ్రకొలను, నిడమర్రు క్లస్టర్ హైస్కూల్, పలు ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఎంఈవో భాస్కర్‌కుమార్, రిసోర్స్‌పర్సన్ దాసు పాల్గొన్నారు.

జేసీబీతో కంటైనర్ తొలగింపు

దెందులూరు: జాతీయ రహదారిపై కొమిరేపల్లి–సత్యనారాయణపురం మధ్య సోమవారం జరిగిన ప్రమాదంలో కంటైనర్‌ను జేసీబీతో మంగళవారం దెందులూరు ఎస్సై శివాజీ పర్యవేక్షణలో తొలగించారు. ప్రమాదం జరిగిన వెంటనే రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. మంగళవారం జేసీబీతో పూర్తిస్థాయిలో ఆ ప్రాంతంలో కంటైనర్ లేకుండా చేశారు. ఇదే ప్రమాదంలో ముక్కలుగా విడిపోయిన ట్రాక్టర్ ఇంజన్, ట్రక్కు, వీల్స్‌లను ప్రమాద స్థలం నుంచి తొలగించారు.